# శ్రీ షిరిడీ సాయి వైభవమ్




శ్రద్ధ సబూరి

సాయిదర్బార్, హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయిబానిస శ్రీరావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్

సంచిక : 3 ఫిబ్రవరి, 2018




కాకా సాహెబ్ దీక్షిత్ డైరీ – 3 వ.భాగమ్

వాడా నిర్మాణం:

షిరిడీలో ఆయన ఉన్న కొద్దికాలం సాఠేవాడాలో బస చేశారు. కాని అక్కడ చాలా అసౌకర్యంగా ఉండటంతో, భగవంతుడు తనకు అంతులేని సంపదనిచ్చాడని దానిని ఆ భగవంతునికే ఉపయోగించాలని నిశ్చయించుకున్నారు.

కాకా సాహెబ్ తన మనసులో ఉన్న కోరికను శ్రీసాయిబాబాకు విన్నవించుకొని, తాను చేసే సత్కార్యానికి బాబావారి అనుమతి కోరాడు. సరిగా సాఠేవాడాకి ఎదురుగా నున్న చిన్న స్థలాన్ని కొన్నాడు. బాబావారి అనుమతితో, డిసెంబరు 10, 1910 సంవత్సరంలో సాఠేవాడా నిర్మాణం ప్రారంభమయి, నాలుగు నెలల తరువాత పూర్తి అయింది.

మార్చి 12, 1911 సం. కాకా సాహెబ్ గారి గుండె గుడిలో, బాబా వారు తన సమస్త శక్తులతో ఆశీనులై ఉన్నారు.

ఆకారణం చేత ఆయన ఐహిక సంబంధమయిన బంధాలను, అనుబంధాలను క్రమక్రమంగా తగ్గించుకోవడం ప్రారంభించారు. షిరిడీయే ఆయన నివాసస్థానం.

బాబావారి ఆశ్రయంలో పొందిన మనశ్శాంతి, శక్తివల్ల, కాకా సాహెబ్ గారికి ప్రాపంచిక విషయాల మీద బంధాలమీద ఆసక్తి తగ్గిపోవడం మొదలయి షిర్డీనే తన ఆవాసంగా చేసుకున్నారు. ఒకరోజు ఆయన బాబాతో, బాబా, భగవంతుడు నాకు తిండికి లోటు లేకుండా సంపదనిచ్చాడు. అటువంటపుడు నేను ఈ భవబంధాలలో

ఎందుకు చిక్కుకోవాలి? నా అదృష్టం కొద్దీ నాకు షిరిడీలో ఉండే అవకాశం వచ్చింది. స్వర్గంలాంటి ఈ షిరిడీని నాకు వదలి వెళ్ళాలనిపించటము లేదు. నాకింక ఏ నరకమూ వద్దు. నేను నా న్యాయవాది వృత్తిని వదలివేసి ఇక ఎప్పటికీ షిరిడీలోనే ఉండిపోదల్చుకున్నాను అన్నారు.

శ్రీసాయిబాబా మృదుమధురమైన స్వరంతో అన్నారు, "కాకా, నువ్వు నీ న్యాయవాద వృత్తిని వదలుకోవలసిన అవసరమేముంది"

"బాబా నేను నావృత్తిలో సత్యాలని అసత్యాలుగా, అసత్యాలని సత్యాలుగా నిరూపణ చేయాల్సి ఉంటుంది" అని జవాబిచ్చారు.

శ్రీసాయిబాబా, ఇతరులని వారికేదిష్టమయితే వారిని అది చేయనీ, కాని మనమెందుకు చేయాలి. నువ్వు నీవృత్తిని నిజాయితీతో నిర్వహించు. కాని నీవృత్తిని వదలి పెట్టాల్సిన అవసరం లేదు అన్నారు. ఈవిధమయిన సలహాతో కాకాసాహెబ్ తన వృత్తిని కొనసాగించారు. కాని సంవత్సరంలో ఎక్కువ సమయం షిరిడీలోనే గడిపి శ్రీసాయిని మనస్ఫూర్తిగా సేవించారు.

శ్రీసాయిబాబా ఆయనను ప్రతిరోజు ఉదయం ఏకనాథ భాగవంతం, రాత్రి రామాయణం చదవమని ఉపదేశించారు. యిది ఆయనకు 62 సం.వయసు వరకూ దినచర్యగా మారిపోయి ఆతరువాత ఆయన ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళిపోయారు.

1926 స.లో కాకా సాహెబ్ దీక్షిత్ కుమారుడు రామకృష్ణకు జబ్బు చేసింది. అతనిని డా.దేశ్ ముఖ్ గారి ఆస్పత్రిలో చేర్పించారు. కాక సాహెబ్ తన కొడుకుని చూడటానికి విలే పార్లే నుంచి కొలాబాలో ఉన్న గోవిందరావు ఆర్.దబోల్కర్ గారిని కలుసుకోవడానికి వెళ్ళారు. ఆస్పత్రికి వెళ్ళేముందు ఆయన పరిమళ భరితమైన అగరువత్తులు వెలిగించి, దాసగణు వ్రాసిన మధురమయిన ఈక్రింది కీర్తనను ఆలపించారు.

"సాయి రహం నజర్ కర్ నా బచ్చోం కా పాలన్ కర్ నా - జానా తుమ్ నే జగత్ పసారా - సబ్ హీ ఝూట్ జమానా- సాయి రహం నజర్ కర్ నా - బచ్చోం కా పాలన్ కర్ నా - మై అంధాహూ బందా అప్ కా ముఝుసే ప్రభు దిఖలానా - సాయి రహం నజర్ కర్ నా - బచ్చోం కా పాలన్ కర్ నా - దాసగణు కహే అబ్ క్యాబోలూ థక్ గయీ

మేరీ రస్ నా - సాయి  రహం నజర్ కర్ నా - బచ్చోం కా పాలన్ కర్ నా - సాయి రహం నజర్ కర్ నా - బచ్చోం కా పాలన్ కర్ నా -"

తరువాత ఆయన ధబోల్కర్  గారితో కలిసి మాహీం స్టేషన్ కి చేరుకున్నారు.  ఆక్కడ ఆయన శ్రీసాయిబాబా అంకిత భక్తుడయిన రఘునాధ్ పురందరే గార్ని కలుసుకున్నారు.  రామకృష్ణ అనారోగ్యంతో ఉన్నాడని తెలుసుకొని తాను కూడా ఆస్పత్రికి వస్తానని చెప్పారు.  వారు మాహీం స్టేషన్ కి మూడు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు.  కాని బాబా దయ వల్ల వారు రైలు అందుకోగలిగారు.

రైలు ఎక్కిన  తరువాత కాకాసాహెబ్ "బాబా ఎంత దయామయులు? ఆయన తన భక్తుల అతి చిన్న కోరికలను కూడా తీరుస్తారు.  మనకి ఈ రైలు తప్పిపోయి వుంటే మనకి ఈ రోజంతా వ్యర్ధమయిపోయి రాత్రంతా కొలాబాలోనే గడపాల్సి వచ్చేది" ఇలా అంటూ కాకా సాహెబ్ కళ్ళు మూసుకున్నారు.  కాకా సాహెబ్ శ్రీసాయిబాబాని ధ్యానిస్తూ ఆనందంలో మునిగిపోయారని పురందరే గారు, ధబోల్కర్ గారు ఊహించుకున్నారు.

నాలుగయిదు స్టేషన్ లు దాటిన తరువాత ధబోల్కర్ గారు మెల్లగా "భావూ ! మెలకువగానె ఉన్నారా?" అన్నారు.  ఆయన తన ప్రశ్నని మూడు మార్లు అడిగారు. కాని కాకా సాహెబ్ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.  మాహీం స్టేషన్ నుంచి రైల్వే డాక్టర్ గారిని పిలిపించారు.  డాక్టర్ పరీక్షించి, కాకాసాహెబ్ ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళిపోయారని చెప్పాడు.

కాకా సాహెబ్ గారి శరీరాన్నివిలే పార్లేలోని ఆయన యింటికి తీసుకుని వచ్చారు.  1926 వ.సం. జూలై 5వ. తారీకు ఏకాదశి సోమవారమునాడు 62.సం.వయసులో కాకాసాహెబ్ శ్రీసాయిబాబాలో ఐక్యమయిపోయారు (స్వర్గం).  శ్రీసాయి బాబా ఆయనతో ఎప్పుడూ అంటూ ఉండేవారు "కాకా నేను నిన్ను విమానంలో తీసుకుని వెడతాను."

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే ఆయన మరణం సద్గురువుయొక్క దీవెన అనే భావించవచ్చు.

భగవద్గీతలో కూడా "మానవుడు అంత్యకాలమున దేనినయితే స్మరిస్తాడో వాడు దానినే పొందుతున్నాడు" అని చెప్పబడింది.

ఇక్కడ ఈ సంఘటనలో కాకా సాహెబ్ శ్రీసాయిబాబా వారి యశస్సుని, దయార్ద్ర హృదయాన్ని గురించి మాటలాడుతూ ఆఖరి శ్వాసను తీసుకున్నారు. ఆవిధంగా ఆయనకు సద్గతి లభించింది. మానవుడు మరణించేముందు నోటితో భగవన్నామాన్ని ఉచ్చరించడం చాలా అరుదు. కాకా సాహెబ్ లాంటి గొప్పవారు మాత్రమే ఆఖరి చరమాంకంలో భగవంతుని స్మరించడం మరువరు.

## సాయి భక్తుల అనుభవాలు

ఈ సంచికలో శ్రీమతి ప్రియాంకా రౌతేలా, డెహ్రాడూన్ వారి అత్యద్భుతమైన అనుభవాన్ని ప్రచురిస్తున్నాను. ఈ లీల ఆమె తన ఆంగ్ల బ్లాగులో అక్టోబరు 2008 లో ప్రచురించడం జరిగింది. ఆమె అనుభవాన్ని యధాతధంగా ప్రచురిస్తున్నను.

## నా పుట్టినరోజునాడు బాబాగారి అనుగ్రహము



ఈ రోజు గురువారము చాలా ప్రత్యేకమయినది. యెందుకంటే ఈ రోజు నా పుట్టినరోజు నాడు బాబాగారు నన్ను అనుగ్రహించారు. కాని, ఈసారి మాత్రం నేను నా పుట్టినరోజు నా స్నేహితులతోకలిసి జరుపుకోకుండా, సాయిమా తో జరుపుకోవాలనుకున్నాను. క్రితం రోజు రాత్రి, నేను, నాభర్త, ఈ రోజు సాయి మందిరానికి వెళ్ళి అక్కడ బీదవారికి అన్నదానము చేద్దామని యోచన చేశాము. మేము ఈ రోజు బీదవారికి పంచడానికి, వెచ్చటి శాలువాలు కూడా కొన్నాము. అంచేత ఈ ఆలోచనతో నేను ప్రొద్దున్నే లేచి తయారయి బాబా విగ్రహానికి స్నానం చేయించి, పూజ చేసి,చందనము దిద్ది, ఆరతి ఇచ్చాను.

ఆరతి అయిపోయింది, నేను, "సచ్చిదానంద సద్గురు సాయి నాథ్ మహరాజ్ కి జై" అని జయధ్వానము చేశాను. బాబాగారికి జై అని చెప్పిన వెంటనే, మా ఇంటిలోకి ఒకరు వచ్చి "అమ్మా,బాబాగారు మీ ఇంటికి వచ్చారు" అన్నాడు.  నేను "యెవరదీ?" యెవరు మీరు" అని ఆడిగాను.

అతడు, "నా పేరు ఆషు  అని తనను పరిచయం చేసుకున్నాడు.(ఇతను నా భర్త పని చేసే ఆఫీసులో సహోద్యోగి)  నేనింకా యేదయినాఅడిగేలోపే అతను మేడ మీదకొచ్చి, నేను బాబా పూజ చేస్తున్న చోట నా ప్రక్కన నుంచున్నాడు.వచ్చి, "అమ్మా, ఈ రోజు బాబాగారు సాయి మందిరమునుంచి, అదీ గురువారమునాడు మీ ఇంటికి వచ్చారు. " అని చెప్పి ఒక పాకట్ నాచేతికిచ్చాడు.

నేను అతని వద్దనుంచి ఇటువంటి బహుమతి వస్తుందని ఊహించలేదు కాబట్టి, హాస్యమాడున్నాడనిపించింది. అతను చాలా చిన్నవాడు, పైగా అతనికి నేను సాయి భక్తురాలినని కూడాతెలియదు. అంచేత యెదో ఒక షో పీస్ తెచ్చి ఉంటాడు నాకోసం అనుకుని, దానిపైనున్న కాగితంవిప్పి చూసేటప్పటికి, అందులో ఆకుపచ్చని శాలువాతో అందమైన దండ, కిరీటంతో అందమైనబాబా విగ్రహం చూసేటప్పటికి నాకు చాలా సంతోషం వేసింది.   ఆ విగ్రహాన్ని చూడగానే, బాబాని మా ఇంటికి ఆహ్వానిస్తున్నానా అన్నట్లుగా నా కళ్ళనుంచి ఆ విగ్రహం మీద కన్నీరు కారడంమొదలుపెట్టింది.  నా శరీరంతా మంచులా చల్లగా అయింది.



నేను బాబాగారి విగ్రహాన్ని పరిశీలిస్తున్నప్పుదు, విగ్రహం పాదాల వద్ద కొంచెం చెక్కుకు పోయివుండడం గమనించాను.  నేను ఆ విగ్రహాన్ని మార్చేద్దామనుకున్నాను.  మేము యెలాగూ సాయి మందిరానికి వెడుతున్నాము కాబట్టి, ఆ విగ్రహాన్ని మార్చేసి, కొత్తది తీసుకుందామని,సాయి మందిరంలోఉన్న షాపు లోకి

వెళ్ళాము. షాపు యజమానికి చెప్పి విగ్రహం పాదాల వద్దకొంచెం చెక్కుకుపోయి ఉంది, ఇంకొకటి మార్చమని ఆడిగాను. ఆ షాపతనికి నేను బాగాతెలుసును కాబట్టి, "ఓహ్, అవును, ఇంతకు గంటన్నర క్రితమే ఒకబ్బాయి వచ్చి, యెవరికో బహుమతిగా ఇవ్వాలని చెప్పి ఈ విగ్రహాన్ని పట్టుకు వెళ్ళాడు. అప్పుడు నేను, అవును ఈ రోజునా పుట్టినరోజు, నాకు బహుమతిగా ఇచ్చాడు" అని చెప్పాను. షాపు యజమాని నాకు శుభాకాంక్షలు చెప్పి 5 నిమిషాలు ఉండమన్నాడు.

తరువాత చేతిలో పెద్ద విగ్రహంతో తిరిగి వచ్చాడు. ఇది పెద్ద విగ్రహం, మా ఇంటిలో ఇప్పటికే యిలాంటిది ఉందని చెప్పి, వద్దన్నాను. అప్పుడు అతను, మీరు దీనిని తీసుకోవాలి, యెందుకంటేఇది చాలా ప్రత్యేకమయినది. నన్ను నమ్మండి. ఇందులో బాబాగారు ఉన్నారు అని చెప్పాడు. “2నెలల క్రితం కొంతమంది సాయిభక్తులు వారింటిలో పెద్ద సత్సంగము చేసుకున్నారు. ఈ సత్సంగానికి వారు 500మంది భక్తులని పిలిచారు. అంచేత వారు నా వద్ద ఈ విగ్రహాన్ని కొన్నారు. కాని, సత్సంగము అయిన వెంటనే, నా షాపుకి వచ్చి, ఈ విగ్రహాన్ని ఇచ్చివేసి, దాని బదులుగా పెద్ద బాబా ఫోటో తీసుకున్నారు. ఈ విగ్రహం చాలా పెద్దది, దానిని జాగ్రత్తగా చూడడం కూడా తమవల్ల కాదనిచెప్పారు. ఇంతే కాకుండా షాపతను, "నాకెందుకో మనసులో ఈ విగ్రహాన్ని మీరు తీసుకోవాలనిచెపుతోంది. నానుంచి ఇది మీకు బహుమతి అనుకోండి అని చెప్పాడు.

"మీరెందుకింత విలువైన విగ్రాహాన్ని నాకు ఇవ్వాలనుకుంటున్నారు" అని అడిగాను. అప్పుడు అతను "మీరు అది అడగవద్దు ఇది బాబాగారి ఆజ్ఞ" అన్నాడు.

నేనేమీ మాట్లాడకుండా ఆ విగ్రహాన్ని తీసుకుని ఇంటికి తిరిగి వచ్చాను. కాని, నామనసు కుదురుగా లేదు. బాబాగారు నాకేదో చెబుదామని అనుకుంటున్నట్లుగా అనిపించింది.

ఆరోజు సాయంత్రం నేను కాఫీ త్రాగుతుండగా ఈ విగ్రహం గురించి షాపతను చెప్పిన మాటలన్నిమరలా గుర్తుచేసుకోవడం మొదలుపెట్టాను. హటాత్తుగా నాకు, డెహ్రాడూన్ లో తొందరలోనే సాయిసత్సంగము ప్రారంభించమని బాబాగారు సూచిస్తున్నట్లుగా నాకు అర్ధమయింది .

ఇప్పుడంతా వివరంగా చెబుతాను. కొన్ని రోజులక్రితం, త్యాగరాజు గారినుంచి, తమ ఊరిలోసత్సంగము చేస్తున్నట్లుగా, నన్నుకూడా డెహ్రాడూన్ లో సత్సంగము చేయమని మెయిల్ చేయడం జ్ఞప్తికి వచ్చింది. నాకు ఈ సలహా నచ్చింది, కాని నేను షిరిడీ నుంచి వచ్చాక ఒక్కసారి మాత్రమే చేద్దామనుకున్నాను. కాని, బాబాగారి లీలలు చాలా అద్భుతంగా ఉంటాయి.

ఈరోజు ఇంతపెద్ద విగ్రహం ఒకరి ఇంటిలో సత్సంగములో ఉన్న తరువాత, వెంటనే సత్సంగము ప్రారంభించమని సూచన చేస్తున్నట్లుగా మాఇంటికి తిరిగి వచ్చింది.

అందుచేత డేహ్రాడూన్ లో సాయి సత్సంగము నిర్వహణ బాధ్యత నేను తీసుకోవాలని బాబాగారి కోరిక, సూచన.

ఇది రాసినతరువాత నా మనసు ప్రశాంతంగా ఉంది. సాయంత్రం ఆరతి అయిన తరువాత నేను,నాపనిలో పూర్తి న్యాయం చేకూరుస్తానని బాబాగారికి మాటిచ్చాను.

సాయి సత్సంగము గురించి ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేస్తాను. ఇంతకుముందెప్పుడూ నా పుట్టినరోజు నాడు ఇటువంటి అనుగ్రహం నాకు లభించలేదు. బాబాగారు తన విగ్రహంతో నన్ను అనుగ్రహించారు. ఈ రోజున ఆయన నన్ను ఈవిధంగా దీవించారంటే నమ్మలేకపోతున్నాను.

(సర్వం శ్రీ సాయినాధార్పణమస్తు)



సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారు రచించిన ఆనాటి ఋషులు – నేటి షిరిడీ సాయి నుండి…

సనాతన ధర్మంలో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఆనాటి ఋషులు, ఈనాటి కలియుగములోని షిరిడీ సాయి.

(గత సంచిక తరువాయి)

6.  ఋష్యశృంగముని ఈయనకు పుట్టుకతోనే శిరస్సు మీద లేడికొమ్ము ఉండటము వలన ఈయనకు ఋష్యశృంగుడు అని నామకరణము వచ్చినది.  ఈయన తండ్రి విభండక మహర్షి.  తల్లి ఊర్వశి.  నేటి కర్నాటకలోని శృంగేరీ శంకర మఠము ఒకనాడు ఋష్యశృంగముని తపస్సు చేసిన ప్రదేశము.  కరువు కాటకములు వచ్చినప్పుడు వానలు కురిపించిన మునీశ్వరుడు.  ఈయన దశరధ మహారాజ కుమార్తె అయిన శాంతను వివాహమాడెను.  ఈయన మామగారికి మగసంతానము లేకపోవుటచేత ఆయన చేత పుత్రకామేష్టి యాగము చేయించెను.  ఆ యాగ ప్రసాదమును దశరధుని ముగ్గురు రాణులకు పంచి ఇచ్చెను.  ఆ ప్రసాదము తినిన కౌశల్య, సుమిత్ర, కైకేయిలకు, రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు జన్మించినారు.  ఈ కలియుగములో షిరిడీ సాయినాధులవారు శరీరముతో ఉన్న రోజులలో మగ సంతానము లేని నాందేడ్ నివాసి రతన్ జీ షాపూర్ జీ వాడియాకు పుత్రసంతానము మరియు కోపర్ గామ్ సర్కి ఇన్స్పెక్టర్ గోపాలరావు గుండుకు, దామూ అన్నా కాసర్, ఔరంగాబాద్ కర్ లకు ఆశీర్వచనాలు ప్రసాదించి వారికి సంతాన యోగాన్ని కలిగించిన అపర ఋష్యశ్రింగులు అని చెప్పక తప్పదు.

7.  గౌతమముని  :  ఈయన సప్తఋషులలో ఒకరు.  శ్రీహనుమంతులవారి తల్లి అంజనాదేవి ఈ గౌతమ ముని కుమార్తె.  అందుచేత శ్రీహనమంతులవారికి గౌతమముని తాఅతగారనే  విషయము చెప్పబడినది.  గౌతమ ముని గోహత్యాపాతకము నుండి బయట పడటానికి కఠోరమయిన తపస్సు చేసి శివుని మెప్పించి గంగను రప్పించి చనిపోయిన గోవుమీద ప్రవహింపచేసి ఆ గోవును బ్రతికించెను.  ఆనాటినుండి ఆ ప్రదేశములో గంగ ప్రవహించటము చేతను, గౌతమ ముని తపస్సు వలనే ఆ గంగకు గౌతమి అని, గోవును బ్రతికించిన పవిత్ర జలము గాబట్టి 'గోదావరి' అని పేరు వచ్చినది.  శ్రీసాయినాధులవారు తమ వెనుకటి జన్మలలో గౌతమముని కాలము వారు అని చెప్పడములో సందేహము లేదు.  శ్రీసాయి షిరిడీలో ఉంటూ షిరిడీకి 8 కోసుల దూరములో ఉన్న గోదావరి నదిని ఎల్లప్పుడు గంగానది అని పిలిచేవారు.  గౌతమముని అహల్య శాపవిమోచనము సందర్భముగా పరస్త్రీ వ్యామోహము మంచిది కాదు అని చెప్పి ఇంద్రుడిని వికృతరూపము ధరింపమని శపించెను."  అహల్యను ప్రాయశ్చిత్త దీక్షగా శిలవలె ఉండి ఇంద్రియవ్యామోహాన్ని జయించమని తెలిపినాడు.

ఇక శ్రీసాయినాధులవారు తమ జీవిత చరిత్ర 49 వ.అధ్యాయములో నానాసాహెబ్ చంద్రోర్కర్ కు మానసిక చంచలత్వము మంచిది కాదు అని సున్నితముగా చెప్పిన విషయాన్ని పరిసీలిద్దాము. ఒకనాడు ద్వారకామాయిలో నానాసాహెబ్ చందోర్కర్ మహల్సాపతి ఉండగా బీజాపూర్ నుండి కొంతమంది గోషాస్త్రీలు బాబా దర్శనమునకు వచ్చి తమ ముఖముపైనున్న ముసుగును తొలగించి బాబా పాదాలకు నమస్కరించిరి. ఆ సమయములో నానాసాహెబు చందోర్కర్ ఒక అందమైన స్త్రీ ముఖాన్ని చూసి మనసులో చాంచల్యము పొందెను. బాబా ఆ విషయాన్ని కనిపెట్టి తన చేతిలోని సటకాతో నానాసాహెబ్ చంద్రోర్కర్ ను చిన్న దెబ్బకొట్టి "నానా అనవసరముగా చికాకు పడుచుంటివేల? ఇంద్రియములను వాని పనులను చేయనిమ్ము. వానిలో మనము జోక్యము చేసికొనకూడదు. దేవుడు ఈ సుందర ప్రపంచాన్ని సృష్టించి యున్నాడు. కాన, అందమును చూచి సంతసించుట మన విధి. మన హృదయము స్వచ్ఛముగా ఉన్నంత వరకు ఏమి దోషములేదు. మనలో చెడ్డ ఆలోచనలు రానీయరాదు, అని పరస్త్రీ వ్యామోహము మంచిది కాదు అని చెప్పిరి.

(ఇంకా ఉంది)



## షిరిడీ వార్తలు :

ఇకనుంచి షిరిడీలో గంటకు 6 వేలమందికి 200/_ రూపాయల టికెట్టు

షిరిడీ సాయిబాబా దర్శనం చేసుకునేందుకుప్రత్యేక టిక్కెట్ రూ.౨౦౦/- ను గంటకు ఆరువేల మందికి చొప్పున విక్రయించాలనినిర్ణయించారు. గతంలో కేవలం మూడువేల మందికి మాత్రమే ఈ టికెట్లను విక్రయించేవారు. ఈ వెసులుబాటు వల్ల ఎక్కువ సంఖ్యలో భక్తులు ప్రత్యేక టిక్కెట్ ద్వారాదర్శనం చేసుకోగలుగుతారని సంస్థాన్ ఒక ప్రకటనలో పేర్కొంది.



# సాయి ఉపాసక్ కలం నుండి......

సాయిని నిరంతరం మన మనసులోనే నిలుపుకోవాలంటే ముఖ్యంగా కావలసినది నామస్మరణ. సాయి సత్ చరిత్రలోని ఘట్టాలను మన మదిలోకి తెచ్చుకోవడం కూడా ఆయనని మనం స్మరిసున్నట్లే లెక్క. బాబా వారు అప్పుడే కాదు, ఇప్పుడు కూడా తన భక్తులకు ఎన్నో అనుభవాలను ప్రసాదిస్తూనే ఉన్నారు. అటువంటి లీలలను మనం చదువుతున్నపుడు మనకు కూడా అటువంటి అనుభవాలు కలిగితే బాగుండును అన్నంతగా మనలని ప్రభావితం చేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

పాఠకులకి కూడా బాబావారు ప్రసాదించిన అనుభవాలు ఏమన్నా ఉన్నట్లయితే మైల్ ద్వారా పంపించండి. మన పత్రికలో ప్రచురిస్తాను.

sayidarbar@gmail.com కు మీ అనుభవాలను పంపించగలరు.

సాయి ఉపాసక్ --- త్యాగరాజు